సాక్షి ఆదిలాబాద్

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



భక్తుల భద్రత గాలిలో దీపమే!

బాసరలోని ప్రధాన రహదారుల వెంట వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ రైల్వేస్టేషన్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది లేక అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 8లో▸



వేసవిలో కూల్‌కూల్‌గా..

వేసవిలో ఎండలు దంచి కొడుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం ఇచ్చే కూలర్లకు డిమాండ్ పెరిగింది. ఇప్పటికే కూలర్ల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0/24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. వేకువజామున జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కుష్బూగుప్తా

ఇంద్రవెల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా సూచించారు. శుక్రవారం మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. డెంగీ, మలేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రోజూ క్రమం తప్పకుండా వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు పాఠాలు బోధించి సబ్జెక్టుల వారీగా వారి సామర్థ్యాలు తెలుసుకున్నారు.

ఏఐతో నాణ్యమైన బోధన



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)తో నాణ్యమైన బోధన అందుతుందని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రణదీవెనగర్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ విద్యాబోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి బోధన తీరు గురించి తెలుసుకున్నారు. సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయులు భూపతిరెడ్డి, శ్రీహరిబాబు, రాజేశ్వర్ తదితరులున్నారు.

ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి

నాణ్యమైన బోధన అందించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల, గెజిటెడ్ నంబర్-1, బాలక్‌మందిర్ తదితర కేంద్రాల్లో ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో నాయకత్వ లక్షణాల పెంపు, మధ్యాహ్న భోజనం, పాఠశాలల నిర్వహణ, తరగతి గదిలో బోధన, అభ్యసన సామర్థ్యాలు, వార్షిక ప్రణాళిక తదితర అంశాల గురించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌గౌడ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మాడిఫైడ్ సైలెన్సర్లు వద్దు




మాడిఫైడ్ సైలెన్సర్లతో డీఎస్పీ, సీఐ, సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: మాడిఫైడ్ సైలెన్సర్లు బిగిస్తే వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు కూడళ్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. 50 వాహనాల సైలెన్సర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కొందరు వాహనదారులు భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని తెలిపారు. అలాంటి వాహనాలను సీజ్ చేసి, పబ్లిక్ న్యూసెన్స్, ఎంవీ యాక్ట్, పట్టణ మిషన్స్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సీఐ ప్రణయ్, సిబ్బంది ఉన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం వద్దని ధర్నా

కైలాస్‌నగర్: తమ కాలనీలో సెల్‌టవర్ నిర్మాణం చేపట్టవద్దని జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్‌బోర్డు పరిధిలోగల జుబ్లీహిల్స్ కాలనీవాసులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పిల్లాపాపలతో కలిసి ఉదయం 11.30కి కార్యాలయానికి వచ్చి మధ్యాహ్నం 3.30గంటల వరకు బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులను కలిసేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు. దీంతో మధ్యాహ్న భోజనం అక్కడే చేసి ఆందోళన కొనసాగించారు. చివరకు టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత వారి వద్దకు వచ్చి మాట్లాడారు. సమావేశం ఉండటంతోనే రాలేకపోయాయని ఆమె తెలిపారు. అయితే టవర్ నిర్మాణదారు, కాలనీవాసులతో హియరింగ్ నిర్వహించి సమస్య పరిష్కరించాలని కోర్టు ఆదేశించినట్లు కాలనీవాసులు తెలిపారు. కానీ, వార్డు మాజీ కౌన్సిలర్ ఒత్తిడికి తలొగ్గి అధికారులు తమ సమస్య పట్టించుకోకుండా వారికే వంత పాడుతున్నారని, హియరింగ్ తేదీని ప్రకటించి సమావేశం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని అధికారి తెలుపగా ఆందోళన విరమించారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ శివారులోని సర్వే నంబర్ 77, 78లో ఏర్పాటు చేసిన లేఅవుట్ ఇది. దీనిని 45 ప్లాట్లతో ఏర్పాటు చేయగా, గతంలోనే రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇది పాత లేవుట్ కావడంతో అందులోని ప్లాట్ల విక్రయాలూ ఇప్పటికీ కొనసాగుతున్నాయి.




భుక్తాపూర్ శివారులోని సర్వే నంబర్ 77, 78లో ఉన్న పాత లేఅవుట్‌లో 45 ప్లాట్లు ఉండగా.. దాన్ని ఆనుకుని ఉన్న భూమిలో ఇటీవల 51 ప్లాట్లతో కొత్తగా చేసిన మరో లేఅవుట్ ఇది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందులోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం లేకపోవడంతో దీనికి 77/ఆ, 78/3/ఆ బై నంబర్లతో పాత లేఅవుట్‌కు జత చేశారు. పాత, కొత్త లేఅవుట్ ఒకటేనని చూపుతూ అందులోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఇది అక్రమమని తెలిసిన సదరు సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.



రిజిస్ట్రేషన్ల దందా!

- పాత దానికి కొత్త లేఅవుట్ లింక్
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- ఎల్‌ఆర్‌ఎస్ మాటున చేతివాటం
- సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో అక్రమాలు



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల ఏర్పాటు చేసిన లేఅవుట్‌లోని ప్లాట్లకూ ఎల్‌ఆర్‌ఎస్-2020లో భాగంగా దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేయడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంలో సదరు సబ్ రిజిస్ట్రార్ ఒక్కో ప్లాట్‌కు రూ.50వేల చొప్పున దండుకున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన సదరు అధికారి విధుల్లో చేరిన నుంచి ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ అక్రమ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లకే ప్రాధాన్యతనిస్తున్నారని ఆశాఖ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. శాఖాపరంగా ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయని చెప్పుకొంటున్న ఆ అధికారి కార్యాలయంలో ఎవరినీ లెక్క చేయకుండా అక్రమ రిజిస్ట్రేషన్లకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెబుతున్నారు. తాజాగా జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల దందాలో సదరు అధికారి డాక్యుమెంట్ రైటర్లపై పక్షపాత వైఖరి చూపుతుండగా ఈ అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం వెలుగులోకి వచ్చింది.

అసలేం జరిగిందంటే..

ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ శివారు పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 77, 78లో ఓ పట్టాదారు తన వ్యవసాయ భూమిని లేఅవుట్‌గా మార్చాడు. అందులో 45 ప్లాట్లు ఏర్పాటు చేసి వాటిని విక్రయించాడు. పాత లేఅవుట్ కావడంతో వాటి రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. అయితే అదే సర్వే నంబర్‌లోగల కొంత భూమిని తాజాగా పట్టాదారు తన కుటుంబీకులకు విక్రయించాడు. ఆ భూమిలోనూ మరో లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఇటీవలే లేఅవుట్ ఏర్పాటు కావడం, అధికారికంగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అందులోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేదు. అయితే తాజాగా సదరు లేఅవుట్ చేసిన వ్యక్తి పాత లేఅవుట్‌కే కొత్త లేఅవుట్ జతచేశాడు. దానికి సర్వే నంబర్ 77, 78తో పాటు 77ఆ, 78/3/ఆ గా బై నంబర్లను క్రియేట్ చేసి రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం 2020కి ముందు లేఅవుట్ చేసి అందులో 10 శాతం ప్లాట్లు విక్రయించినట్లయితే ఎల్‌ఆర్‌ఎస్ కింద ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కొత్త లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేదు. దీంతో దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కొత్త ఎత్తుగడ వేశారు.

అందుబాటులోకి రాని సబ్‌రిజిస్ట్రార్

కాగా, ఈ విషయమై సదరు సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించేందుకు కార్యాలయానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. ఫోన్‌లో పలుసార్లు సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఎల్‌ఆర్‌ఎస్ లేకుండా కొత్త లేఅవుట్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అలాంటివి జరిగినట్లు నా దృష్టికి రాలేదు. విచారణ చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగితే రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీకి నివేదిక పంపించి సదరు సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకుంటాం. డబ్బులకు ఆశపడి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినా.. రిజిస్ట్రేషన్ల కోసం డబ్బులు డిమాండ్ చేసినా.. కఠినంగా వ్యవహరిస్తాం. ఇలాంటి వాటిపై ప్రజలు నాకు ఫిర్యాదు చేయవచ్చు.

– రవీందర్‌రావు, జిల్లా రిజిస్ట్రార్, ఆదిలాబాద్

సదరు సబ్ రిజిస్ట్రార్ ప్రభుత్వ నిబంధనలు ఖాతరు చేయడం లేదనే విమర్శలున్నాయి. 45 ప్లాట్ల

ఎల్‌ఆర్‌ఎస్ మాటున దందా..

తో కూడిన పాత లేఅవుట్‌కు కొందరు కొత్తగా 51 ప్లాట్లతో ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను జతచేశారు. వాటికి ఎల్‌ఆర్‌ఎస్-2020లో భాగంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఇప్పటికే ఈ లేఅవుట్‌లోని పలు ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరగగా గురువారం ఒక్కరోజే ఐదు రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం. అయితే ఒక్కో ప్లాట్‌కు రూ.50వేల చొప్పున సదరు అధికారి ముడుపులు అందుకున్నట్లు ప్రచారం సాగుతోంది. అక్రమ లేఅవుట్ కావడంతో ఎల్‌ఆర్‌ఎస్ చేసుకుంటే సక్రమమై ప్లాట్లు త్వరగా విక్రయించడంతో పాటు అన్ని అనుమతులు తెచ్చుకోవచ్చనే ఉద్దేశంతో సదరు వ్యాపారి కూడా సబ్ రిజిస్ట్రార్ అడిగినంత ముట్టజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. మరి కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు ఇలాంటి లేఅవుట్ల పత్రాలే తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయాలని కోరడంతో అందుకు సదరు అధికారి అంగీకరించలేదు. దీంతో సదరు డాక్యుమెంట్ రైటర్లు ఆయనతో వాగ్వాదానికి దిగారు. ఆ లేవుట్ ప్లాట్లను చేసి తమవెందుకు చేయడం లేదని ప్రశ్నించారు. రూ.50వేల చొప్పున ఇస్తే చేసిస్తానని వారితో బహిరంగానే ప్రకటించినట్లు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. తాను జిల్లా రిజిస్ట్రార్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చి ఇక్కడకు వచ్చానని.. అందుకే డబ్బులు తీసుకుంటున్నట్లు తమతో చెప్పినట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెలిపారు. చేయి తడిపితే అక్రమ డాక్యుమెంట్లనూ సక్రమంగా చేస్తున్న సదరు అధికారి నిబంధనల ప్రకారం అన్నీ ఉన్నా డబ్బులివ్వకుంటే పక్కనపెట్టి ఇబ్బందులకు గురిచేస్తారనే విమర్శలు చేస్తున్నారు. మొత్తానికి ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ఈ ఘటనే నిదర్శనం.

అందుబాటులోకి సీఎన్‌జీ యూనిట్లు

- జిల్లాలో నాలుగు చోట్ల ఏర్పాటు
- త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం
- పెరిగిన ఈ-వాహనాల వినియోగం



జిల్లా కేంద్రంలోని తిరుమల ఫిల్లింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీఎన్‌జీ యూనిట్

సాక్షి, ఆదిలాబాద్: కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) యూనిట్లు జిల్లాలోనూ అందుబాటులోకి వస్తున్నాయి. నాలుగుచోట్ల ఏర్పాటు చేసిన వీటిని వారంరోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం సీఎన్‌జీ వాహనాల వినియోగం కూడా బాగా పెరిగింది. అయితే ఈ ఇంధనం లభించే పాయింట్లు ఇప్పటివరకు లేక అక్రమ పద్ధతిలో ఫిల్లింగ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీని కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు రవాణారంగ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ గ్యాస్ లభించే యూనిట్లు ఏర్పాటవుతుండటంతో ఈ-వాహనాల వినియోగం మరింత పెరిగే ఆస్కారముంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) ఆధ్వర్యంలో తొలిసారిగా ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ తిరుమల ఫిల్లింగ్ స్టేషన్, ఖుర్షీద్‌నగర్ జైళ్లశాఖ పెట్రోల్ పంపు, గుడిహత్నూర్ మండలంలోని సీతాగొంది (కమలాపూర్) సమీపంలోని దర్శి పెట్రోల్ బంక్, జైనథ్ మండలం భోరజ్‌లోని కోకో పెట్రోల్ పంపులో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. సీతాగొంది యూనిట్ మినహా మిగతా యూనిట్ల నిర్మాణం పూర్తయింది.

డిమాండ్ నేపథ్యంలోనే..

పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీతో నడిచే వాహనాలకు తోడు ప్రస్తుతం మార్కెట్‌లో సీఎన్‌జీ వాహనాల వినియోగం పెరుగుతూ వస్తోంది. దీనికి తగ్గట్లుగా ఇంధనం మార్కెట్‌లో లభించకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పెట్రోల్, డీజిల్ విక్రయం లీటర్లలో, సీఎన్‌జీ విక్రయంలో కేజీల్లో ఉంటుంది. ప్రస్తుతం దీని ధర కేజీకి రూ.93 వరకు ఉన్నట్లు పెట్రోలియం వ్యాపారులు పేర్కొంటున్నారు. కాగా, జిల్లాలో ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న ఒక్కోసీఎన్‌జీ డిస్పెన్సరీ యూనిట్ సామర్థ్యం సుమారు 3వేల కేజీలుగా చెబుతున్నారు. ఒక్కోదానిని రూ.కోటిన్నర అంచనాతో ఏర్పాటు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఆదిలాబాద్ మార్కెట్‌లో సీఎన్‌జీ విస్తృతంగా లభించే పరిస్థితి ఉండగా ఈ-వాహనాలు వినియోగించే వారికి ఊరట లభించనుంది.

రేషన్‌కార్డుంటే 'ఆదాయం' అవసరం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు రేషన్‌కార్డు ఉన్నవారికి ఆదాయ ధ్రువీకరణపత్రం అవసరం లేదని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. దరఖాస్తు ప్రక్రియపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునేందుకు రేషన్‌కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. దరఖాస్తు గడువు ఈ నెల 14వరకు పొడిగించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయా కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డీఆర్డీవో, ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు పథకం నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. బ్యాంక్ మేనేజర్లు ఈ కార్యక్రమంపై ఒరియంటేషన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, బీసీ సంక్షేమాధికారి రాజలింగు, వివిధ బ్యాంకుల అధికారులు, మేనేజర్లు పాల్గొన్నారు.

'సీసీఐని ప్రారంభించేదాకా పోరాడుతాం'



నిమ్మ రసమిచ్చి దీక్ష విరమింపజేస్తున్న రామన్న

కైలాస్‌నగర్: మూతపడ్డ ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని కేంద్రం పునఃప్రారంభించేదాకా పోరాడుతామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పేర్కొన్నారు. ఫ్యాక్టరీని తెరిపించాలనే డిమాండ్‌తో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో 17రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష ముగిసింది. దీక్షలో కూర్చున్నవారికి ఆయన శుక్రవారం నిమ్మరసమిచ్చి విరమంపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించినందున దీక్ష విరమిస్తున్నట్లు తెలిపారు. సీసీఐ ప్రారంభానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పలుసార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించామని పేర్కొన్నారు. వందేళ్లకు సరిపడా ముడిసరుకు కలిగిన ఫ్యాక్టరీ ప్రారంభమైతే జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. సీసీఐ పునఃప్రారంభించేదాకా ఎన్ని పోరాటాలైన చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు డీ మల్లేశ్, విజ్జగిరి నారాయణ, సిర్ర దేవేందర్, దాసరి రమేశ్, పోశెట్టి, నగేశ్, రమేశ్, ఈశ్వర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సెలవుల్లో వెసులుబాటు

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు సెలవుల్లో వెసులుబాటు కల్పించినట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సంవత్సరానికి ఐదు అదనపు సీఎల్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత కాలానికి ఏప్రిల్ వరకు ఒక అదనపు సీఎల్ పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచి సంవత్సరానికి ఐదు అదనపు సీఎల్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు ఒక నెల వరకు చెల్లింపులేని వైద్య సెలవులు పొందవచ్చని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే ముందు వారంలోపు వివరణ కోసం నోటీస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ ఏడాదిపాటు చెల్లుబాటయ్యేలా గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కేజీబీవీల్లో నైట్ డ్యూటీ చేసే ఉపాధ్యాయులు మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు రిలీవ్ కావచ్చని, వారి మధ్యాహ్న తరగతులు ఉదయానికి మార్చనున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎంలకు కేటాయించిన మూడు నైట్ డ్యూటీల్లో ఒకటి ఇతర సిబ్బందికి మార్పు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బేస్మెంట్ దశ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు తక్షణమే నగదు చెల్లింపులు చేయనున్నట్లు తెలిపారు. బేస్మెంట్ ఏరియా 400 స్క్వేర్ ఫీట్స్ కంటే ఎక్కువ గాని, తక్కువ గాని ఉండకూడదని, సిమెంట్ ఇటుకలతోనే గోడలు నిర్మించుకోవాలని సూచించారు. స్థానిక ఇటుకలను నిర్మాణాలకు వాడకూడదని తెలిపారు. నిరుపేద లబ్ధిదారులు బేస్మెంట్ నిర్మించుకునేందుకు ఎస్‌హెచ్‌జీల ద్వారా ఆర్థికసాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఆదిశగా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ నెలాఖరు వరకు 20 నుంచి 30 బేస్మెంట్లు నిర్మించాలని, వాటి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ డబ్బులు నాలుగు విడతల్లో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రారంభం కాని చోట్ల వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని, మేస్త్రీలను నియమించుకుని వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. మోడల్ విలేజ్ నిర్మాణ పనులను జూన్ 30లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సులో వేసవిలో శిక్షణ పొందేందుకు ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 17నుంచి 29వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, హన్మకొండ, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లో మే 1నుంచి 11వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు bse.telangana.gov.inలో లేదా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ



మనోహర్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి (డీఎండబ్ల్యూవో)గా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌రావ్ శుక్రవారం జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు నుంచి అదనపు బాధ్యతలు తీసుకున్నారు. కార్యాలయ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

లక్కీడ్రా పద్ధతిపై అనాసక్తి



లక్కీడ్రా తీస్తున్న ఆర్డీవో వినోద్‌కుమార్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధికారులు ఎట్టకేలకు దృష్టి సారించారు. పట్టణంలోని అంబేడ్కర్‌చౌక్, గాంధీచౌక్, శివాజీచౌక్, దేవిచంద్ చౌక్‌లోని వీధివ్యాపారులను ఇతర స్థలాలకు తరలించేందుకు ఇటీవల రెవెన్యూ అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో 201 మంది వీధి వ్యాపారులున్నట్లు గుర్తించారు. వారికి ఖాళీగా ఉన్న గణేశ్ థియేటర్ స్థలాన్ని వ్యాపారాల కోసం కేటాయించేందుకు శుక్రవారం ఆర్డీవో వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో లక్కీడ్రా నిర్వహించారు. 201 షాపులకు గాను డ్రా తీసి ఎంపిక చేశారు. అయితే ఈ ప్రక్రియపై వీధివ్యాపారులు అంతగా ఆసక్తి చూపలేదు. 201 మందికి గాను 10-15 మంది మాత్రమే హాజరయ్యారు. వ్యాపారులు లేకుండానే అధికారులు డ్రా ప్రక్రియ కానిచ్చారు. శ్రీరామ నవమి అనంతరం ఒక్కొక్కరికి 6/7 స్థలాన్ని కేటాయించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు తెలిపారు. స్థలాల కేటాయింపు పూర్తయిన వెంటనే వారందరినీ అక్కడికి తరలించనున్నట్లు వెల్లడించారు. ముందుజాగ్రత్త చర్యగా పకడ్బందీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయగా డీఎస్పీ జీవన్‌రెడ్డి స్వయంగా భద్రతను పర్యవేక్షించారు. సీఐలు సునీల్‌కుమార్, ప్రణయ్, టీపీఎస్ నవీన్‌కుమార్, సిబ్బంది వినయ్‌కుమార్, ఖుర్బాన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న కాలనీవాసులు

నార్నూర్: నీటి సమస్య పరిష్కరించాలని శుక్రవారం మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీవాసులు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు వచ్చి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ ఆందోళనకారులతో ఫోన్‌లో మాట్లాడారు. నూతన ట్యాంక్‌కు కనెక్షన్ ఇచ్చి రెండురోజుల్లో పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేస్తామని, అప్పటివరకు వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వగా ఆందోళన విరమించారు. వీరికి ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్ మద్దతు తెలిపారు. బాబూలాల్, గుణవంత్‌రావ్, ప్రవీణ్, దేవిదాస్, రవీందర్, ఊర్మిళాబాయి, శారద, నిర్మల ఉన్నారు.

సన్నబువ్వ రుచి చూసిన అధికారులు



లబ్ధిదారుతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంపై లబ్ధిదారుల స్పందన తెలుసుకునేందుకు శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారి ఎండీ వాజిద్ అలీ, ఆదిలాబాద్‌అర్బన్ తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, ఆర్‌ఐ యజ్వేందర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాథోడ్ బాబుసింగ్ జిల్లా కేంద్రంలోని శ్రీరాం కాలనీలో పర్యటించారు. కాలనీకి చెందిన సరోజ ఇంట్లో సన్నబియ్యంతో వండిన అన్నం రుచి చూశారు. భోజనం ఎలా ఉందని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. రుచికరమైన భోజనం అందుతుందని, బయటి మార్కెట్ నుంచి సన్నబియ్యం తెచ్చుకోవాలంటే రూ.2వేల వరకు ఖర్చయ్యేదని లబ్ధిదారులు తెలిపారు. ప్రస్తుతం ఆ ఖర్చు తగ్గిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్ పార్టీ నాయకుడిపై క్రిమినల్ కేసు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్‌లో అసత్య ప్రచారం చేసిన బీఆర్ఎస్ పార్టీ పట్టణ నాయకుడు నూనేటి సత్యనారాయణపై శుక్రవారం క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్‌హెచ్‌ఓ రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో కొందరు కాంగ్రెస్ నాయకులు డబుల్ బెడ్రూం ఇళ్ల ముందున్న ఖాళీ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని పోస్టులు చేశాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య ఫిర్యాదు చేశారని తెలిపారు. తప్పుడు ప్రచారం చేసి ప్రజాశాంతికి భంగం కలిగించిన సత్యనారాయణపై క్రిమినల్ కేసు నమోదు చేశామని తెలిపారు.

జల్సాల కోసం మోటార్ సైకిళ్ల చోరీ

చెన్నూర్: జల్సాల కోసం మోటార్‌సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని చెన్నూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ దేవేందర్‌రావు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెన్నూర్ పట్టణా నికి చెందిన ఖాజా ఇమ్రాన్, చల్లా సుధాకర్‌రెడ్డి మోటారు సైకిళ్లు చోరీకి గురయ్యాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎస్సై సుబ్బారావు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన ముస్కె జగదీష్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. కూలీ పనులు చేస్తే వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోవడం లేదని, మోటార్ సైకిళ్లు దొంగలించి అమ్ముకుంటున్నాడని విచారణలో వెల్ల డైంది. చెన్నూర్‌కు చెందిన రెండు మోటార్ సైకిళ్లతోపాటు భూపాల్‌పల్లిలో గత డిసెంబర్‌లో ఒక మోటార్ సైకిల్ దొంగలించినట్లు అంగీకరించాడని సీఐ తెలిపారు. దొంగలించిన వాహనాలను అమ్మడానికి చెన్నూర్‌కు రాగా పట్టుకున్నామని తెలిపారు. మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని జగదీష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని నిరాల గ్రామానికి చెందిన జేసీబీ డ్రైవర్ చౌదరి సంతోష్ (46) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్ శుక్రవారం ఉదయం స్నానం చేసేందుకు బాత్‌రూంలోకి వెళ్లాడు. ఈక్రమంలో కరెంట్ స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుతుళ్లున్నారు. ఇదివరకే ఓ కూతురికి వివాహమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ Direct Final Year BA, BCom, BSC, MA, MSc, M.Com, B.Lic, M.Lic, Btech, MBA, LLB, GNM, BAMS, DPharmacy. BPharmacy, cont: Asin acadamy, NZB. Cell:94400 27497. [SCA25002565]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [SCA25002557]

■ అర్జెంట్‌గా మూతపడ్డ సర్ సిల్క్ కంపెనీకి వాచ్‌మెన్లు మరియు సూపర్‌వైజర్స్ మరియు ఫ్యాక్టరీ ఇన్‌చార్జీలు కావలెను. సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన సర్ సిల్క్ కంపెనీ ఖాఘజ్‌నగర్ జీతం : 8000/- ఉచిత గృహ వసతి కుటుంబంతో ఉండవలెను. సంప్రదించండి : 9440050036 / 7569783139 / 9000711050 [SCA25002582]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

భక్తుల భద్రత.. గాలిలో దీపమే!

- బాసరలో ప్రధాన రోడ్లపై చీకట్లు
- రైల్వే స్టేషన్ బయట కానరాని సెక్యూరిటీ
- జిల్లాలోని ప్రధాన ఆలయాల వద్ద ఇదే పరిస్థితి



బాసర రైల్వేస్టేషన్ వద్ద రాత్రివేళలో

సాక్షి విజిట్

భైంసా/బాసర: అక్షర జ్ఞానం అందించాలని.. ఆపదలను తొలగించాలని బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల భద్రత గాలిలో దీపంలాగే మారింది. తెలంగాణతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి నిత్యం భక్తులు బాసరకు వస్తారు. అయితే దైవ దర్శనం కోసం వచ్చిన వారి రక్షణ బాధ్యత అధికారులపై ఉంది. వందలాది మంది భక్తులు రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలోనే నిద్రపోతుంటారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేటలో ఓ మహిళపై సామూహిక అత్యాచార ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో నిందితులైన ఆలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, ఆటో డ్రైవర్, వంటవాళ్లు, ఎలక్ట్రీషియన్ తదిరులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ప్రముఖ ఆలయమైన బాసరకు వచ్చే భక్తుల భద్రత తెలుసుకునేందుకు 'సాక్షి' బాసర పట్టణాన్ని అర్ధరాత్రి సమయంలో విజిట్ చేసింది. ఈ సందర్భంగా భద్రతాలోపాలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. పోలీసులు, విద్యుత్, ఆలయ అధికారుల మధ్య సమన్వయం లోపం భక్తులకు శాపంగా మారింది. వేసవి సెలవుల్లో ఆలయాల్లో భక్తుల సందడి పెరుగుతుంది. ఈ సమయంలో దొంగతనాలు, అఘాయిత్యాలు జరగకుండా జిల్లా పోలీసులు, దేవాదాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

భద్రతా లోపాలు..

నిర్మల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బాసరలో రాత్రి సమయంలో భద్రత సరిగా కనిపించడం లేదు. రైల్వే స్టేషన్ సమీపంలో ప్రయాణికులు దిగే ప్రధాన రోడ్డుపై బస్టాండ్ లేదు, విద్యుత్ దీపాలు వెలగడం లేదు. గోదావరి నది ప్రాంతంలో చీకట్లు కమ్ముకున్నాయి. బాసర గ్రామంలో బస్టాండ్ వద్ద సెక్యూరిటీ లేదు, ఆలయానికి వెళ్లే ఏటీఎం వద్ద ప్రైవేట్ గార్డు కూడా కనిపించడం లేదు. పోలీసులు గస్తీ తిరుగుతున్నామని చెప్పినా ఆలయ ప్రాంగణంలో పికెటింగ్ కనిపించలేదు. ఆలయానికి వెళ్లే ప్రధాన మార్గాల్లో సెంట్రల్ లైటింగ్ అలంకారప్రాయంగానే మారింది. రైల్వే స్టేషన్ ప్రాంతంలో రాత్రిళ్లు మందుబాబులు సంచరిస్తున్నారు. రాత్రి రైళ్లలో వచ్చే యాత్రికులు ప్రైవేట్ ఆటోలపై ఆధారపడాల్సి వస్తోంది. బాసర ఆలయానికి బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ, రాత్రి సమయంలో అది అందుబాటులో ఉండడం లేదు. రైలు మార్గంలో వచ్చే భక్తులు, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, స్థానికులు ప్రధాన రోడ్డుపై గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. వందలాది ప్రయాణికులు ఉండే ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా లేవు.



బాసర ప్రధాన కూడలిలో చిమ్మ చీకటి

> **వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం**
>
> బాసరలోని ప్రధాన కాలనీతోపాటు రహదారుల్లో అక్కడక్కడ సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. వీధి దీపాలు ఏర్పాటు చేసి రాత్రి సమయంలో వెలిగేలా చూస్తాం. పంచాయతీ సిబ్బంది ప్రధాన వీధుల్లో ఎప్పటికప్పుడు డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూస్తాం.
>
> – పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, బాసర

జిల్లాలోని ఆలయాల పరిస్థితి..

నిర్మల్ జిల్లాలో బాసర సరస్వతి ఆలయం, లోకేశ్వరం బ్రహ్మేశ్వర ఆలయం, కుంటాల గజ్జలమ్మ ఆలయం, కల్లూరు సాయిబాబా ఆలయం, కదిలి పాపహరేశ్వరాలయం, బీరవెల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, సారంగాపూర్ అడెల్లి పోచమ్మ ఆలయం, నిర్మల్ వెంకటేశ్వర ఆలయం, గండి రామన్న ఆలయం వంటి అనేక ఆలయాలు ఉన్నాయి.

భక్తులకు సౌకర్యాల కొరత..

ప్రముఖ ఆలయాల వద్ద వసతి, మూత్రశాలలు ఉన్నప్పటికీ, నిర్వహణ సరిగా లేదు. చిన్న ఆలయాల్లో కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. జాతరలు, ఉత్సవాల సమయంలో రాత్రిళ్లు ఆలయాలకు వెళ్లేవారు ఎక్కువ. ఖర్మకాండల కోసం కూడా ఆలయాల్లో నిద్రపోతుంటారు. గ్రామాలు, పట్టణాలకు దూరంగా ఉన్న ఆలయాల వద్ద సౌకర్యాలు, భద్రత లోపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో చీకటి పడితే మద్యం ప్రియులు సంచరి స్తూ సీసాలు పగలగొడుతున్నారు. రాత్రి సమయంలో పోలీసు గస్తీ ఉంటే ఇలాంటి పరిస్థితులను నియంత్రించవచ్చని భక్తులు అభిప్రాయపడుతున్నారు.



ఆలయం ముందు నిర్మానుష్యంగా..



గోదావరిబ్రిడ్జి -రైల్వే స్టేషన్ రహదారిపై చీకటి



ఆలయం సమీపంలో ఏటీఎం వద్ద..



ఆలయ ప్రాంగణంలో నిద్రిస్తున్న భక్తులు

ఇసుక ట్రాక్టర్ల కేసు ఉత్తదే?

- ఎస్సైకి తహసీల్దార్ ఫిర్యాదు
- కేసు నమోదు చేయని ఎస్సై

దండేపల్లి: మండలంలోని కాసిపేట గోదావరి నది నుంచి ఇసుక అక్రమంగా తరిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్ఐ భూమన్న తమ సిబ్బందితో కలిసి వెళ్లారు. ట్రాక్టర్లను పట్టుకునేందుకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆలస్యంగా రావడం, రెవెన్యూ అధికారులను చూసి నదిలో ఉన్న కొన్ని ట్రాక్టర్లను డ్రైవర్లు నది అవతలి వైపు తీసుకెళ్లి తప్పించుకున్నారు. నదిలో మూడు ఇసుక ట్రాక్టర్లను డ్రైవర్లు వదిలి వెళ్లారు. వాటితోపాటు రెండు ట్రాలీల్లో ఇసుకను నింపి ఇంజన్లను దాచి ఉంచారు. మూడు ట్రాక్టర్లతోపాటు రెండు ట్రాలీల వివరాలను లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ ఎస్సై తహసీనొద్దీన్‌కు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఎస్సై ఫిర్యాదు తీసుకోకపోవడం, కేసు నమోదు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దార్‌ను సంప్రదించగా ఎస్సైకి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. ఎస్సై తహసీనొద్దీన్ సంప్రదించగా ట్రాక్టర్లను అప్పగించక పోవడంతో కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

ట్రాక్టర్, ఆటో ఢీ.. ఐదుగురికి గాయాలు





రోడ్డు ప్రమాదంలో గాయపడినవారు

భైంసారూరల్: భైంసా–బాసర జాతీయ రహదారిపై శుక్రవారం జరగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా నుంచి దేగాం వైపు ప్రయాణీకులతో ఆటో వెళ్తుంది. అదే మార్గంలో హరియాలీ కన్వెన్షన్ ముందున్న ట్రాక్టర్ యూటర్న్ చేస్తుండగా ఆటోఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇలేగాం గ్రామానికి చెందిన ఆకాశ్, సాయి, ఉమ్రి(కె) గ్రామానికి చెందిన చంద్రకాంత్, మహాగాం గ్రామానికి చెందిన గంగాధర్, శివలింగుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై శంకర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంపై విచారణ చేపట్టారు.

వేద పాఠశాల విద్యార్థి అనుమానాస్పద మృతి



మణికంఠ మృతదేహం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

బాసర: నిర్మల్ జిల్లా బాసర క్షేత్రంలో వేద పాఠశాల విద్యార్థి అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా కేంద్రానికి చెందిన రాజేందర్ తనయుడు మణికంఠ(17) వేద పాఠశాలలో చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం గోదావరి నది పుష్కరఘాట్ వద్దకు వెళ్లిన మణికంఠ నది కింద భాగంలో బురదలో పడి ఉన్నాడు. గమనించిన భక్తులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది మణికంఠను బాసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న బాసర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ మల్లేశ్, ఎస్సై గణేశ్ పుష్కర ఘాట్లను పరిశీలించారు. విద్యార్థి విద్యుత్‌షాక్‌తో మరణించాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మణికంఠ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని తెలిపారు. గతనెల 21న వేద పాఠశాలకు చెందిన విద్యార్థి మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన లోహిత్‌పై దాడి జరిగింది. 13 గంటల తర్వాత గుర్తించి ఆస్పత్రికి తరలించారు. స్థానికంగా ప్రాథమిక చికిత్స తర్వాత హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. తాజాగా అదే పాఠశాలకు చెందిన విద్యార్థి మణికంఠ అనుమానాస్పదంగా మృతిచెందాడు. దీంతో వేదపాఠశాలలో ఏం జరుగుతుందో అని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇద్దరు పురుగుల మందు తాగగా, ఒకరు ఉరేసుకున్నారు. మరొకరు భవనంపై నుంచి దూకారు.

యజమాని దూషించాడని పాలేరు..

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు నాయిని కన్నయ్య(35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కన్నయ్య గ్రామంలోని రైతు ఎనగంటి చిన్నన్న వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. శుక్రవారం పొలానికి పురుగుల మందు పిచికారీ చేశాడు. స్ప్రేయర్ పంపు చెడిపోయిందని, ఎవరు బాగు చేయిస్తారని చిన్నన్న కన్నయ్యతో గొడవపడ్డాడు. అసభ్య పదజాలంతో దూషించడంతో మనస్తాపం చెందిన కన్నయ్య అక్కడే పురుగుల మందు తాగాడు. 108 అంబులెన్స్‌లో చెన్నూర్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. యజమాని వేధింపుల వల్లే కన్నయ్య మృతి చెందాడని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న, నాయకురాలు మల్లేశ్వరితో మృతుడి కుటుంబ సభ్యులు మంగెనపల్లి క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి ధర్నా చేశారు. మృతికి కారణమైన చిన్నన్న, భార్య లక్ష్మిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నీల్వాయి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తండ్రి బైక్ ఇవ్వలేదని కొడుకు..

నార్నూర్: తండ్రి బైక్ ఇవ్వలేదని కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నాగ్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. గాదిగూడ మండలం ఖడ్కి కొలాంగూడ గ్రామానికి చెందిన మాడవి భీంరావు(19) శుక్రవారం తన తండ్రి మాధవ్‌రావును బైక్ అడిగాడు. భీంరావు తాగిన మైకంలో ఉండడంతో బైక్ ఇవ్వలేదు. దీంతో మనస్తాపానికి గురైన భీంరావు పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. తండ్రికి ఫోన్ చేసి చెప్పగా.. ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతుడి కుటుంబ సభ్యులతో ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

నిమ్స్ ఆసుపత్రిపై నుంచి దూకి వ్యక్తి..


బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంట్రాక్టర్ బస్తీకి చెందిన హన్మాండ్ల నారాయణ(55) శుక్రవారం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి పైనుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణ తండ్రి పోశం అనారోగ్యంతో బాధ పడుతుండగా చికిత్స చేయించడం కోసం నిమ్స్ ఆసుపత్రికి గత నెల 24న తీసుకెళ్లారు. అటెండర్‌గా వెళ్లిన నారాయణ ఆకస్మికంగా పైఅంతస్తు నుండి కిందికి దూకి మృతిచెందాడు. తాగుడు అలవాటు ఉన్న నారాయణ ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. మృతుడికి భార్య రేణుక, సోదరులు ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడు..

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భోరజ్ మండలం గూడ గ్రామంలో చోటుచేసుకుంది. జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుమ్మ కార్తిక్ (19) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం తాగడానికి డబ్బులు కావాలని తల్లి గంగమ్మతో గొడవకు దిగాడు. ఆమె నిరాకరించగా మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెట్టింగ్ మత్తులో యువత

- రూ.లక్షల్లో పందెం..
- యువకుల జేబులు ఖాళీ
- గ్రామీణ ప్రాంతాలకు చేరిన జూదం



చెన్నూర్: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ యువతను చిత్తు చేస్తోంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా జోరుగా సాగుతోంది. జూదం వ్యసనంలా మారి జేబులు ఖాళీ చేస్తోంది. క్రికెట్, ఆటగాళ్లపై అభిమానం హద్దు మీరి యువతలో వ్యసనంగా మారుతోంది. ఆటను చూసి ఆనందించాల్సి పోయి ఏకంగా బెట్టింగ్‌కు పాల్పడుతూ ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. వేలాది రూపాయలు బెట్టింగ్ కాస్తూ కొందరు యువకులు అప్పుల పాలవుతున్నారు. ఈ బెట్టింగ్ వ్యవహారం పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలకూ చేరింది. బెంగళూరు రాయల్ చాలెంజ్, గుజరాత్ టైటాన్స్ జట్లపై కోటపల్లి మండలంలోని ఒక గ్రామంలో పది మంది యువకులు రూ.10వేల చొప్పున రూ.లక్ష బెట్టింగ్ పెట్టి డబ్బులు పోగొట్టుకున్నట్లు సమాచారం. ఈ సంఘటన కోటపల్లిలోనే కాకుండా జిల్లాలో ఏ మేరకు బెట్టింగ్ సాగుతుందో చెప్పకనే చెబుతోంది. ''మామ పది వేలు పోయినయిరా. బుధవారం ఆర్సీబీ గెలుస్తుందని పది వేలు బెట్టింగ్ పెట్టిన జీటీ గెలిచిందిరా. నా డబ్బులే కాదురా పది మందిమి ఆర్సీబీ గెలుస్తుందని పది వేల చొప్పున బెట్టింగ్ పెటినం. అందరి డబ్బులు పోయినయ్..'' ఇదీ చెన్నూర్‌లో ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ. ఐపీఎల్ బెట్టింగ్ జోరుగా సాగుతుందనడానికి వీరి సంభాషణే ఉదాహరణగా చెప్పొచ్చు.

ముందుగానే అంచనా..

మ్యాచ్‌కు ముందుగానే జట్టు బలాలను అంచనా వేస్తూ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. కొందరు అభిమాన కెప్టెన్లపై నమ్మకంతో బెట్టింగ్‌కు దిగుతుండగా.. మరికొందరు జట్టులోని క్రీడాకారులు ఆటతీరుపై బెట్టింగ్‌లు కాస్తున్నట్లు తెలిసింది. ఒక్కోసారి వారి అంచనాలు తారుమారై నష్టపోతున్నట్లు తెలిసింది.

ఫోన్ పే ద్వారా చెల్లింపులు..

బెట్టింగ్ చెల్లింపులు అన్నీ ఫోన్ పే ద్వారానే సాగుతున్నాయి. బెట్టింగ్‌లో పాల్గొనే వ్యక్తులు మధ్యవర్తికి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపిస్తున్నారు. ఏ జట్టు గెలిస్తే ఆ జట్టు తరపున బెట్టింగ్ కాచిన వ్యక్తికి మధ్యవర్తి డబ్బులు చెల్లించే విధంగా ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. అధికారులు స్పందించి బెట్టింగ్‌లకు కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది. లేదంటే మే నెల 25న జరిగే ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ వరకు బెట్టింగ్‌ల జోరు కొనసాగే అవకాశాలున్నాయి.

అర కిలో బంగారం ఆశ చూపి..

- రూ.4.50 లక్షలు వసూలు
- గుప్తనిధుల పేరిట మోసం..
- ముగ్గురి రిమాండ్.. పరారీలో ఒకరు
- రూ.1.47 లక్షలు రికవరీ..

ఖానాపూర్: అరకిలో బంగారం ఆశ చూపి రూ.4.50 లక్షలు వసూలు చేసిన ఉదంతం ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని కడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏఎస్పీ రాజేశ్‌మీనా, సీఐ సీహెచ్.అజయ్, కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. ఖానాపూర్ మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన సాదుల నరేశ్ హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అక్బర్ వద్ద కొంతకాలంగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కడెం మండలం అటవీ ప్రాంతంలో గుప్తనిధులు ఉన్నాయని రూ.4.50 లక్షల చెల్లిస్తే అరకిలో బంగారం ఇస్తామని ఆశ చూపుతూ నమ్మబలికాడు. గత నెల 31న కడెం మండలానికి వచ్చిన అక్బర్‌ను నరేశ్‌తోపాటు మరో ముగ్గురు యువకులు కడెం మండలంలోని కొత్త మద్దిపడగ శివారులోని అటవీ ప్రాంతానికి కారులో తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లాక డబ్బులు లాక్కొని బెదిరించి వెళ్లగొట్టారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు అక్బర్ వెంటనే ఈ విషయమై అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారన్నారు. నరేశ్ తన తల్లికి ఆరోగ్యం బాగా లేదని రూ.4.50 లక్షలు అవసరం ఉందని అందుకు బదులుగా బంగారం, ఆస్తి పేపర్లు కుదువ పెడతానని తనకు చెప్పడంతో తాను పై నగదును నరేశ్‌కు ఇచ్చానని బాధితుడు ఫిర్యాదులో తమకు తెలిపాడని పోలీసులు వెల్లడించారు. గుప్త నిధుల కోసం సదరు యువకులతో కలిసి అన్వేషించి మోసపోయిన అక్బర్ తమను సైతం తప్పుదోవ పట్టించేలా తప్పుడు ఫిర్యాదు చేసినట్లు విచారణలో వెలుగు చూసిందన్నారు. ఈ ఘటనలో అక్బర్ నుంచి డబ్బులు వసూలు డబ్బుల నుంచి రూ.1.47 లలు రికవరీ చేయడంతోపాటు గోసంపల్లె గ్రామానికి చెందిన సాదుల నరేశ్, అదే గ్రామానికి చెందిన భూక్యా వంశీ, ఖానాపూర్ పట్టణానికి చెందిన మగ్గిడి నితిన్, పెంబి మండల కేంద్రానికి చెందిన ఆరె చింటుతోపాటు తప్పుడు ఫిర్యాదు చేసిన హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అక్బర్‌పై సైతం కేసు నమోదు చేశామని వివరించారు. శుక్రవారం వంశీతోపాటు నితిన్, చింటులను రిమాండ్ చేశామని తెలిపారు. నరేశ్ పరారీలో ఉన్నాడని వెల్లడించారు. నాలుగు రోజుల వ్యవధిలో సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్న ఖానాపూర్ సీఐతోపాటు కడెం ఎస్సై, పోలీస్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

చికిత్స పొందుతూ మహిళ మృతి



మల్లు మృతదేహం

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి నాయకపుగూడకు చెందిన మేసినేని మల్లు(53) అనే మహిళ ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మల్లు ఈనెల 2న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. వాంతులు చేసుకుంటుండగా గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి, మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రులకు అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందింది. ముఖం మీద పుండు కావడంతో నొప్పి తగ్గక మద్యానికి అలవాటు పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆమె భర్త రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దండేపల్లి మండలంలో..

దండేపల్లి: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ముత్తినేని మొండయ్య(42) చికిత్స పొందుతూ వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో గురువారం మృతిచెందాడు. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మొండయ్య భార్య పద్మ గత రెండు నెలల క్రితం అతడిని విడిచి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్నాడు. ఒంటరిగా ఉండలేక జీవితంపై విరక్తి చెంది గత నెల 29న పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చేర్పించగా.. పరిస్థితి విషమించి చనిపోయాడు. మృతుడి మేనమామ ఉగ్గె రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.